

బాధ్యత లేదా..?

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థానికంగా గర్భస్రావం చేసుకుంటుంటే ఎవరికీ బాధ్యత లేదా..? అంటూ కలెక్టర్ మండిపడ్డారు. - 8లో



పాఠశాల స్థలంలో నిర్మాణాలొద్దు

పాఠశాల స్థలంలో ఇతర నిర్మాణాలొద్దని శ్రీరంగరాజపురం మండలం, పొదలపల్లి గ్రామస్తులు భీష్మించుకున్నారు. - 8లో



మొక్కలను సంరక్షించాలి

మొక్కలు నాటడంతోపాటు వాటిని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

బీపీ హరిస్తోంది



అవగాహన ర్యాలీలో అధికారులు, సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సరైన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల బీపీ వెంటాడుతూ మనుషులను హరిస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి తెలిపారు. చిత్తూరులోని తన కార్యాలయంలో శనివారం ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో బీపీ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ప్రజలు సరైన ఆహార నియమావళి పాటించకపోవడంతో ఈ బీపీ అల్లుకుపోతుందని తెలిపారు. జంక్ ఫుడ్స్, మద్యం, మాంసాహారం అతిగా తీసుకోవడం వల్ల బీపీ సమస్యలు తలెత్తుతాయన్నారు. అలాగే మానసిక ఒత్తిడిలు కూడా బీపీ వ్యాప్తికి ప్రధాన కారణమన్నారు. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాయామం చేయాలన్నారు. వైద్యాధికారులు హనుమంతరావు, గిరి, అనిల్, కుమార్, ప్రవీణ, అనూష పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పాతురుసత్తంలో మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

బైరెడ్డిపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజలందరి బాధ్యత అని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. మండల పరిధిలోని బైరెడ్డిపల్లె, పాతపేట, పాతురునత్తం గ్రామ సచివాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం చేయడంలో ప్రజలను భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలను విరివిగా పెంచినప్పుడే వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, స్వచ్ఛభారత్ ఎంసీఓ సురేష్‌బాబు, సర్పంచులు వెంకటేష్, రోజా, పంచాయతీ కార్యదర్శులు సదాశివయ్య, మోహన్, రాంప్రసాద్, పాల్గొన్నారు.

ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగి ఉండాలి



డిజిటల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయిస్తున్న అధికారులు

గుడిపాల: ప్రతి రైతూ ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగి ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ, వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. శనివారం మండలంలోని పాపసముద్రం సచివాలయంలో రైతులకు స్కిల్ ఆఫ్ చిత్తూరు, డిజిటల్ ట్రైనింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగించి సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, వ్యవసాయ యాప్‌లు, డిజిటల్ పేమెంట్స్, యూట్యూబ్ చానల్స్ నిర్వహణ, వాతావరణం, మార్కెట్ ధరల గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ సిబ్బంది తులసీరాంరెడ్డి పాల్గొన్నారు.

భూ'మేత'!



ఆక్రమణకు గురైన అటవీ భూమి

కూటమి నేతలు భూ కుబేరులవుదామని స్కెచ్ వేశారు. ఇదే అదునుగా విలువైన భూములపై కన్నేశారు. అప్పనంగా దోచేయాలని పావులు కదిపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోయారు. ప్రభుత్వ భూములను ఇబ్బడిముబ్బడిగా కబ్జాచేస్తున్నారు. కుటుంబ సభ్యులు, బినామీ పేర్లపై ఎక్కించుకుని ఆ భూమి మాదే అంటూ మెలిక పెడుతున్నారు. బాస్ వెనుకున్నారని మరింత రెచ్చిపోతున్నారు. ఇది ముమ్మాటికి ఆక్రమణే అని తెలిసినా.. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా జంకుతున్నారు. ఇంతకీ ఈ కుబేరుల భూదందా ఎక్కడో మీరే చదవండి..!

- 194.వెంకటాపురం, ఎగువమాసాపల్లిలో భూకుంభకోణం
- 40 ఎకరాల మేర మేత బీడు, వంక భూముల ఆక్రమణ
- బినామీ పేర్లతో కాజేసిన కూటమి నేత
- బాస్ వెనకున్నారని బరితెగింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షిటాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం, అనుపల్లి నుంచి బండపల్లి, 194.వెంకటాపురం, ఎగువమాసాపల్లి ప్రాంతం మీదుగా తచ్చూరు నేషనల్ హైవే రోడ్డు ఉంది. దీనిపక్కనే భూములకు రెక్కలొచ్చాయి. ఎకరా భూమి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలకు చేరింది. ఇదే అదునుగా భూకుబేరులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. ముడుపులకు ఆశపడిన కొందరు సర్వేయర్లను రంగంలోకి దింపారు. ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయోనని గాలించారు. మేత బీడు, వంక భూములు, డీకేటీ భూములు, అటవీశాఖ భూములను వరుసగా దోచుకునేందుకు పక్కా స్కెచ్చేశారు. సర్వేయర్‌తో స్కెచ్ గీయించుకుని వీర్వోలను బుట్టలో వేసుకున్నారు. భూకుబేరుల కుటుంబీకులు, వాళ్లకు అనుకూలంగా ఉన్న వ్యక్తులను బినామీగా మలుచుకున్నారు. వాళ్లకే తెలియకుండా 25 నుంచి 30 మంది వరకు ఎకరా నుంచి రెండు ఎకరాల మేర పలు సర్వే నంబర్లలో భూములు కేటాయించారు.



ఎగువమాసాపల్లి వద్ద అటవీభూములను సర్వే చేస్తున్న మండల సర్వేయర్, సిబ్బంది

ఎగువమాసాపల్లి వద్ద ఏం చేశారంటే..

194. వెంకటాపురానికి చెందిన కూటమి నేత, భూకుబేరుడు ఒక పార్టీకి చెందిన వారే. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం. దూరపు బంధువులు కూడా. ఈ నేపథ్యంలో 194 వెంకటాపురం వద్ద ఎందుకు భూ సమస్య అంటూ వదలిపెట్టినట్లు తెలుస్తోంది. దీంతో రూట్ మార్చుకుని ఎగువమాసాపల్లి ప్రాంతంలో 20 ఎకరాల భూములున్నాయని తెలుసుకున్నారు. అక్కడి అటవీశాఖ, డీకేటీ భూములను ఆక్రమించే పనిలో పడ్డారు. అనుచరులను రంగంలోకి దింపి జేసీబీలతో చదును చేయించారు. మూడో రోజు ముచ్చటగా ఎగువమాసాపల్లికి చెందిన కూటమి నేత, గ్రామస్తులు కలిసి అటవీశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారులు రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తే అది అటవీ భూమి అని తేలింది.

బాస్ ఉన్నారనే..

అధికారం ఉంది.. బాస్(తిరుపతి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే) అండ ఉంది.. మనం ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని భూకుబేరులు ప్రభుత్వ భూములను ఆక్రమించడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఆక్రమిత భూముల జోలికి ఎవరు అడ్డొచ్చినా బాస్ పేరుతో బెదిరిస్తున్నారు. 'భూములు నావి కావు.. మా బాస్‌వే... మీ వల్లయ్యింది చేసుకోండి' అంటూ భూకుబేరులు బహిరంగంగా చెబుతున్నారు. మేమంతా బినామీలే.. .. టచ్ చేస్తే ఎలికాప్టర్‌లోనే దిగుతారని భయపెడుతున్నారు. కాగా ఈ భూమి పక్కాగా చేతుల్లోకి వస్తే బినామీలు ఒక్కొక్కరికీ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఇచ్చేలా డీల్ సెట్ చేశారని సమాచారం. అందుకే ఆ బినామీలు కూడా భూ కుబేరుల వెనుక బ్రహ్మాస్త్రంలా పనిచేస్తున్నారు.

ఆక్రమణలపై చర్యలేవి?

ఇక అటవీశాఖ అధికారులు ఆక్రమణదారులపై కేసు పెట్టేందుకు జంకుతున్నారు. కూటమి నేతల ఒత్తిడి ఉండడంతో అటవీశాఖ అధికారులు నోరువిప్పలేక పోతున్నారు. భూ ఆక్రమణదారులు పరారీలో ఉన్నారని సాకుచూపుతున్నారు. దీనికితోడు రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుల కనుసన్నల్లో మునిగి తేలుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందుకే భూ ఆక్రమణల జోలికి రెవెన్యూ అధికారులు వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలపై గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

194 వెంకటాపురంలో...

బండపల్లి రెవెన్యూలో తచ్చూరు రోడ్డు అనుకుని ఉన్న 194 వెంకటాపురంలో 30 ఎకరాల దాకా మేత బీడు ఉంది. ఇందులో 20 ఎకరాల భూమి తనదే అంటూ అదే గ్రామానికి చెందిన కూటమి నేత జేసీబీతో చదును చేశాడు. విషయం తెలుసుకున్న భూకుబేరులు తమదే భూమి అంటూ ఏకంగా మామిడి మొక్కలు పెట్టేశారు. ఈ భూ వ్యవహారంపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ మండల రెవెన్యూ అధికారులను విచారణ చేపట్టి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. నాటిన మొక్కలను తొలగించాలని హుక్కుం జారీ చేశారు. అధికారులు మామిడి మొక్కలను తొలగించి.. మేత బీడుగా ప్రభుత్వానికి నివేదికలిచ్చారు. కొన్ని నెలల తర్వాత స్థానికంగా ఉన్న నేత మళ్లీ ఆ భూమి తనదే అంటూ బోర్డు పెట్టారు. ఈ బోర్డును భూకుబేరులు కొట్టిపడేశారు. ఇది వివాదంగా మారడంతో భూకుబేరులు ఇప్పుడు రూటు మార్చారు.

సర్వేలో అటవీ భూమిగానే గుర్తించాం

ఎగువమాసాపల్లిలో ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదుపై స్పందించాం. రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నాం. జేసీబీలను సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. వారు ఇచ్చిన సమాచారం మేరకు నివేదికలు సిద్ధం చేస్తున్నాం. వీటిని సోమవారం డీఎఫ్‌కు అందిస్తాం. ఆక్రమణదారులపై తదిపరి చర్యలు ఉంటాయి. రెవెన్యూ అధికారులతో సర్వే చేయగా ఆక్రమిత భూమి అటవీ భూములని తేలింది.

–థామస్, ఎఫ్‌ఆర్‌ఓ, చిత్తూరు ఈస్ట్

కబ్జా చేశారనేది వాస్తవం

భూ ఆక్రమణపై ఫిర్యాదులొచ్చాయి. ఇప్పుడు చదును చేసిన భూమి అటవీశాఖ భూమి అని తేలింది. రెవెన్యూ భూముల విషయానికి సంబంధించి తహసీల్దార్ కూడా నోటీసులు ఇచ్చారు. తప్పు అని తేలితే తదుపరి చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాసులు, ఆర్డీఓ, చిత్తూరు

ముగిసిన ఇంటర్ ప్రధాన పరీక్షలు



నగరిలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్జేడీ, చిత్తూరు డీఐఈఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో నిర్వహించారు. ప్రధాన పరీక్షల్లో చివరి రోజు శనివారం ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షల్లో జనరల్, వొకేషనల్‌లో 5,600 మందికి గాను 510 మంది, మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 1,467 మందికి గాను 115 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని పాలసముద్రం, నగరి బాలురు, బాలికలు, పుత్తూరు బాలురు, బాలికలు, వడమాలపేట కేంద్రాలను ఆర్జేడీ, చిత్తూరు డీఐఈఓ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వైస్ ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీపీఓ సుధాకర్

తవణంపల్లె: ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు తవణంపల్లె మండల వైస్ ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీపీఓ సుధాకర్ తెలిపారు. తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తామన్నారు. మండలంలోని 15 ఎంపీటీసీలు ఎన్నికల్లో పాల్గొని చేతులు ఎత్తే పద్ధతిలో ఎంపిక జరుగుతుందని వివరించారు.

కష్టపడేవారికే గుర్తింపు

- ఎమ్మెల్సీ భరత్



నూతనంగా పార్టీ పదవులు పొందిన వారితో ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: వైఎస్సార్ సీపీలో కష్టపడేవారికే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ, కుప్పం ఇన్ చార్జి భరత్ అన్నారు. శనివారం కుప్పం పట్టణంలోని తన నివాసంలో కుప్పం మండల నాయకులతో మాట్లాడారు. ఇటీవల చా లా మంది పార్టీని వీడారని, వారి కి పార్టీ ఎంతో చేసిందని, అలాంటి వారు మనస్సా క్షి లేకుండా వెళ్లిపోవడం దారుణమన్నారు. మరికొంత మంది పార్టీలోనే ఉంటూ పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. మరింత మందిని సస్పెండ్ చేసేందుకు వెనుకాడబోమన్నారు. నీతి, నిజాయితీ గల కార్యకర్తలు కొంత మంది ఉన్నా, తాము రాజకీయాలు చేసుకోగలమని, ఏ ఒక్కరి పైనో మాధారపడి నడవడం లేదన్నారు. కష్టకాలంలో ఎవరు పార్టీకి అండగా ఉంటారో రేపు అధికారం వచ్చిన తరువాత వారికే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఇప్పటికే అధికార పార్టీ పట్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, ఎందుకు కూటమి ప్రభుత్వానికి ఓటు వేశామా..? అని మదనపడుతున్నారని తెలిపారు. మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్ మాట్లాడుతూ, అక్ర మ కేసులు, తాటాకు చప్పుళ్లకు ఎవరూ బయపడొద్దని, మన ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని కేసులు పోతాయన్నారు. అధైర్యపడొద్దు ... అండగా అంటామని భరోసా ఇచ్చారు. అన ంతరం ఇటీవల పార్టీ పదవులు అలంకరించిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో నాయక లు వనితాశీను, భాగ్యరాజ్, జీవీ.రమేష్, చిన్న దొరై, నాయకులు పాల్గొన్నారు.


నివేదిక సిద్ధం!

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు రూరల్ మండలం ఎగువమాసపల్లె ప్రాంతంలో అటవీ ప్రాంతం ఆక్రమణ పర్వం పై నివేదిక దాదాపు సిద్ధమైంది. తిరుపతి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే అనుచరులు గురువారం అటవీ ప్రాంతంలో జేసీబీలను పెట్టి చదును చేసి కబ్జాకు యత్నించారు. అటవీశాఖాధికారులకు క్షేత్ర స్థాయిలో రెండు జేసీబీలను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులో తీసుకున్నారు. శుక్రవారం రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా ఆ స్థలంలో సర్వే చేశారు. అది అటవీ భూమి అని తేలింది. ఇందులో భాగంగా డ్రైవర్లను విచారించారు. ఇది తమ భూమి అని ఆక్రమణదారులు నమ్మబలికి చదును చేయించారు. ఆక్రమణదారుల నివాసాల వద్దకు వెళ్లి అటవీ సిబ్బంది విచారించగా వారు అక్కడ లేనట్లు గుర్తించారు. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశాల ఆధారంగా డీఎఫ్‌ఓ భరణికి నివేదికను సోమవారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఆమె ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

ఆర్‌డీఎస్‌ఎస్ పనులు త్వరగా చేయండి

చిత్తూరు కార్పొరేషన్: గ్రామీణ ప్రాంతాలకు 3 ఫేజ్ విద్యుత్ సరఫరాను అందించే ఆర్‌డీఎస్‌ఎస్ పనులు త్వరగా చేయాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల ట్రాన్స్‌కో ఎస్‌ఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పలు జిల్లాల్లో ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్నారు. ఫీడర్ల వారీగా పను లు వేగవంతం చేయాలన్నారు. అవసరమైన మెటీరియల్స్ సి ద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే పల్లెలకు మెరుగైన విద్యుత్ అందించవచ్చొన్నారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గాలివాన వచ్చినప్పుడు ఎక్కువ గా సమస్యలు వస్తున్నాయని, పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు నష్టంతో పాటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆ సమయాల్లో వెంటనే విద్యుత్ స్తంభాలు, లైన్, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో లోడ్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయం నుంచి ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 7,849 దరఖాస్తులు



ఏపీఈఏపీ సెట్ వెబ్‌సైట్ చిత్రం


చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏపీ ఈఏపీ సెట్ 2025 (ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షకు 7,849 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షలకు ఈ ఏడాది మార్చి 12వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఏప్రిల్ 24వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో స్వీకరించారు. ఈ నెల 12వ తేదీన పరీక్షల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. చిత్తూరు, పలమనేరు పరిధిలో 7,849 మంది ఈఏపీ సెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇంజినీరింగ్ పరీక్షకు 6,103, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 1,716, రెండు పరీక్షలకు 30 మంది మొత్తం 7,849 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు ప్రవేశ పరీక్షలు ఈనెల 19, 20 తేదీల్లో, ఇంజినీరింగ్ పరీక్షలకు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

31 వరకు ఫీజు చెల్లింపునకు గడువు

తిరుపతి సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని ఆ వర్సిటీ అధ్యయన కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ మల్లికార్జునరావు తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి గడువులోపు ఫీజు చెల్లించాలని కోరారు.

పొట్టేళ్ల చర్మాన్నీ తినేశారు!

- వ్యాపారస్తుడి నుంచి రూ.20 లక్షలు డిమాండ్
- రూ.15 లక్షలు తీసుకున్న తెలుగు తమ్ముళ్లు
- అక్రమాలకు నిలయంగా బోయకొండ



బోయకొండ ఆలయ ముఖచిత్రం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బోయకొండలో తెలుగు తమ్ముళ్లకు కాసుల పంట పండుతోంది. అక్రమార్జనతోపాటు దౌర్జన్యకాండ సాగుతోంది. గంగమ్మ సొమ్ము అప్పనంగా మింగేయడం.. అధికారులు సైతం తమ్ముళ్లకు తలొగ్గి ఆలయ ఆదాయానికి గండికొట్టడం రివాజుగా మారుతోంది. టెండర్లు, వేలం పాటల్లో ఏకపక్షంగా వ్యవహరించి ఆలయ ఆదాయాన్ని కొల్లగొట్టిన తమ్ముళ్లు.. ఇప్పుడు భక్తులు జంతు బలులిచ్చిన పొటేళ్లు, మేకపోతులు, దున్నపోతుల చర్మాలను సైతం మింగేయడం విమర్శలకు తావిస్తోంది.

తమ్ముళ్ల దాదాగిరి

చౌడేపల్లె మండలం, పెద్దూరు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి బోయకొండలో జంతువుల చర్మాన్ని ఉచితంగా సేకరించి విక్ర యించుకునేందుకు తమ్ముళ్ల నుంచి అను మతి పొందాడు. దీనికి ప్రతిఫలంగా త మ్ముళ్లు రూ.20 లక్షలు డిమాండ్ చేయగా.. ఇప్పటివరకు ఆ వ్యాపారి రూ.15 లక్షలు ముట్టజెప్పినట్టు సమాచారం. ఈ మొత్తాన్ని దేవస్థానానికి సైతం చెల్లించక తమ్ముళ్లు తమ జేబులు నింపుకోవడం గమనార్హం.

జరిగేది ఇలా..

సాధారణంగా ఒక్క ఆదివారం మాత్రమే సుమారు 300 నుంచి 400 పొట్టేళ్లు అమ్మవారికి బలిస్తారు. ఒక వారంలో కనీసం 500కుపైగా బలిచ్చి మొక్కులు చెల్లిస్తుంటారు. వీటి చర్మాలను ఒక్కొక్కటి రూ.250 నుంచి రూ.350 వరకు గతంలో భక్తుల నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.

ఉచితం పేరుతో లాగేసుకుంటున్నారు!

భక్తులు అమ్మవారికి పొటేళ్లు, మేకపోతులు బలిచ్చిన తర్వాత తలకాయను దేవస్థానం వద్ద వేలం పాటలో కైవసం చేసుకున్న లీజుదారుడికి ఇవ్వాలి. ఆ తర్వాత ఆలయ సమీపంలో మటన్ కటింగ్ షాపుల నిర్వహకులు భక్తుడు తీసుకెళ్లిన జంతువులకు చర్మాన్ని తీసి, మటన్ కట్ చేసిస్తాడు. ఆ సమయంలో తీసిన చర్మాన్ని అతనే దేవస్థానానికి ఇచ్చేయాలని నమ్మబలుకుతున్నాడు. అలా సేకరించిన చర్మాన్ని తమ్ముళ్ల అండతో సొంతం చేసుకున్న వ్యాపారికి అప్పజెబుతున్నారు.

దోచిపెట్టేస్తారా?

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఎలాంటి టెండర్లు, వేలం పాటలు నిర్వహించాలన్నా, దేవదాయశాఖ కమిషనర్ అనుమతి ఉండాలి. పత్రికా ప్రకటనలు, కరపత్రాల ద్వారా ప్రజలందరికీ తెలియజేయాలి. ఆ తర్వాత బహిరంగంగా వేలం పాటలు చేపట్టాలి. అయితే ఈఓ ఏకాంబరం అండదండలతో నిబంధనలేవీ పాటించకుండా తమ్ముళ్లకు దోచిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. వాళ్లు చెప్పినవన్నీ తలూపి అక్రమార్జనకు దాసోహమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంగమ్మ సొమ్ము తినేస్తున్నారు

బోయకొండ గంగమ్మ సొమ్మును అక్రమంగా తినేస్తున్నారు. ఆలయ ఆదాయానికి గండి పడకుండా కలెక్టర్, దేవదాయశాఖ కమిషనర్ స్పందించి అడ్డుకట్ట వేయాలి.

– భక్తులు, స్థానికులు

క్లుప్తంగా

కాణిపాక ఆలయ హుండీ ఆదాయం రూ.1.75 కోట్లు



హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.1.75 కోట్లు వచ్చినట్టు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.10,569, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.41,660 వచ్చింది. యూఎస్ఏ 208 డాలర్లు, సింగపూర్ 112 డాలర్స్, మలేషియా 32 రింగిట్స్, యూఏఈ 170 దిర్హామ్స్ వచ్చాయి. బంగారం 49 గ్రాములు, వెండి 1.425 కిలోలు వచ్చింది. ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, నాగేశ్వరరావు, కోదండపాణి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

యువకుడి అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ ప్రభాకర్

చౌడేపల్లె: బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆమినిగుంట పంచాయతీ, నూనెముద్దనపల్లెకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన నాగేంద్ర మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడన్నారు. ఈ విషయమై గ్రామంలో పంచాయితీ నిర్వహించి విఫలం కావడంతో బాధితురాలు పోలీసులను ఏప్రిల్ 8న ఆశ్రయించిందని, గర్భవతిని చేయడంతోపాటు ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని, కులం పేరుతో దూషించినట్లు పేర్కొందని తెలిపారు. బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. అరెస్ట్ చేసిన యువకుడిని పుంగనూరు కోర్టుకు తరలించారు. ఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



నుజ్జునుజ్జయిన కారు వెనుక భాగం

పలమనేరు: మండలంలోని బేలుపల్లి క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి ఓ కంటైనర్, కారు ఢీకొన్న ప్రమాదంలో పెద్ద ప్రమాదం తప్పింది. ఓ వైపు వర్షం కురుస్తుండగా తమిళనాడు నుంచి భారీ పరికరంతో కంటైనర్ పలమనేరుకు వస్తోంది. ముందుగా వెళుతున్న కారు ఆగడంతో వెనుకనున్న కంటైనర్ ఉన్నట్టుండి ఆపే ప్రయత్నం చేయగా.. భారీ వాహనం ఆగకుండా కారును ఢీకొంది. కంటైనర్ ముందున్న క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. కారు వెనుక వైపు భాగం దెబ్బతింది. లారీ డ్రైవర్ కంటైనర్‌లోంచి దూకి ప్రాణాలను కాపాడుకోగా కారులోని వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

బాధ్యత లేదా?

- ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారు ?
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుంటే సమాచారం ఎందుకు చేరలేదు
- శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తోంది
- ఆడ పిల్లల్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత
- వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖలపై కలెక్టర్ ఆగ్రహం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టడంలో అధికారులకు బాధ్యత లేదా..? అంటూ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994 జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం ఎందుకు తెలియలేదని మండిపడ్డారు. శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తోందన్నారు. జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నియమ నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుంటే ఎందుకు తెలుసుకోలేక పోయారని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఆశా, ఏఎన్ఎంలు స్థానికంగా ఉన్నప్పటికీ మొదటి, రెండు సంతానాలలో ఆడపిల్లలు ఉండి మూడవ సారి గర్భం దాల్చిన విషయం ఎందుకు తెలుసుకోలేక పోతున్నారన్నారు.

సమావేశాలు ఎప్పుడైనా నిర్వహించారా?

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు కలసి సీడీపీఓలు, మెడికల్ ఆఫీసర్లతో కలసి గత పదేళ్లలో ఎప్పుడైనా సమన్వయ సమావేశాలు నిర్వహించారా..? అని ప్రశ్నించారు. రెండు శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు.

సరిహద్దు మండలాల్లో ఎక్కువ

జిల్లాలో ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న నగరి, పలమనేరు, పుంగనూరు, వి.కోట మండలాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనుమతి లేకుండా జరుగుతున్న అబార్షన్ల శాతం ఎక్కువగా ఉందన్నారు. డివిజన్ల వారీగా ఆర్ఎంపీ డాక్టర్లతో సమావేశాలు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలివ్వాలన్నారు. మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదనే విషయాన్ని తెలియజేయాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అనధికారికంగా స్కానింగ్ మిషన్‌లు అమ్ముతున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి రమేష్, డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఐవో హనుమంతరావు, జిల్లా ప్రధాన వైద్య శాఖ సూపరింటెండెంట్ ఉషశ్రీ, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కీర్తన, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్, ఎస్ఐ నాగసౌజన్య పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అధికారులు ఇద్దరు వ్యక్తిగతంగా ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడితే క్షేత్రస్థాయి పరిస్థితులు కొంత వరకు అర్థమవుతాయన్నారు. అబార్షన్‌లతో ఆడపిల్లలు చనిపోతే, ఆడపిల్లల నిష్పత్తి మరింత తగ్గుతుందన్నారు. జిల్లాలో 2024 నివేదికల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 947 మంది స్త్రీలు ఉన్నట్లు తెలిపారు.

పాఠశాల స్థలంలో నిర్మాణాలొద్దు

- అడ్డుకున్న గ్రామస్తులు



అంగన్‌వాడికి స్థలం కేటాయిస్తూ తహసీల్దార్ ఇచ్చిన ఆర్డర్

శ్రీరంగరాజపురం : పాఠశాల స్థలంలో ఆ పాఠశాలతో సంబంధం లేని నిర్మాణాలు చేపట్టరాదంటూ.. స్థానిక సర్పంచ్ విజయ, గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికుల కథనం.. మండలంలోని వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని పోదలపల్లి గ్రామంలో సర్వే నం.213/16లో ఎకరం 13 సెంటు భూమిని ప్రభుత్వ పాఠశాలకు కేటాయించారు. ప్రస్తుతం ఇక్కడ ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలను మరింత అభివృద్ధి చేశారు. మిగిలిన ఖాళీ స్థలంలో అప్పటి తహసీల్దార్ షబ్బీర్ బాషా 05 సెంటు భూమిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. పక్కా భవనం కూడా మంజూరైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాగానే శనివారం ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ దాము పాదలపల్లి గ్రామానికి కమిటీ హాలు మంజూరైందంటూ పనులు ప్రారంభించారు. స్థానిక సర్పంచ్, గ్రామస్తులు ఆ పనులను అడ్డుకున్నారు. పాఠశాల స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని పేర్కొన్నారు. దీంతో రెచ్చిపోయిన ఎమ్మెల్యే పీఏ 'నాకు అనుతులు ఉన్నాయి.. ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉన్నాయి.. ఎవరైనా మాట్లాడితే వారిపై కేసులు పెట్టిస్తా'నాంటూ రెచ్చిపోయారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి పాఠశాల స్థలాన్ని రక్షించాలని కోరారు.

మొక్కలు సంరక్షించాలి



కలెక్టరేట్‌లో మొక్కలు నాటుతున్న కలెక్టర్, జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్, వివిధ శాఖల కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టరేట్‌లోని ప్రాంగణంలో కలెక్టర్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కలెక్టరేట్ ఏవో కులశేఖర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసుదేవన్, డీఈవో కార్యాలయం ఏడీ-2 వెంకటేశ్వరరావు, సిబ్బంది మురళి, గోపాల్, కుమార్, చైతన్య, జయప్రకాష్, పాల్గొన్నారు.

గుడిపాలలో ట్రాక్టర్ చోరీ

గుడిపాల: గుడిపాల మండలంలోని పానాటూరు గ్రామ సమీపంలో రాధాక్రిష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న ఓ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. తుమ్మలవారిపల్లె గ్రామానికి చెందిన బాలక్రిష్ణమనాయుడు ట్రాక్టర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడని, రోడ్డు పక్కన ఉన్న కాల్బురాళ్ల తోలుతూ ఉండేవాడన్నారు. రోజూ రాధాక్రిష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్దనే ట్రాక్టర్‌ను ఉంచేవాడని, ఈ క్రమంలో ఏపీ39-యూటీ-1588 నంబరు గల ట్రాక్టర్‌తో పాటు ట్రాలీని కూడా గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీ చేసినట్టు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

బీరు బాటిల్‌తో దాడి



చికిత్స పొందుతున్న ఫయాజ్

పుంగనూరు: ఇద్దరు వ్యక్తులు పరస్పరం బీరు బాటిళ్లతో దాడులు చేసుకోగా ఓ వ్యక్తి గాయపడిన ఘటన శనివారం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం.. మండలంలోని గూడూరుపల్లెకు చెందిన కుమార్, నానాసాహెబ్ పేటకు చెందిన ఫయాజ్ కాలనీ ఇండ్ల వద్ద ఘర్షణ పడి బీరు బాటిళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఫయాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాతాశిశువులకు మెరుగైన వైద్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాతా శిశు సంరక్షణకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి తెలిపారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆమె శుక్రవారం ఆ శాఖ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులను సకాలంలో గుర్తించాలన్నారు. వారికి ప్రసవం వరకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తద్వారా మాతా శిశు మరణాలను నివారించవచ్చన్నారు. కాన్పులు ప్రభుత్వాత్రిలోనే జరిగేలా చూ డాలన్నారు. ఇక జాతీయ ఆరోగ్య కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమో దు చేయించాలని చెప్పారు. ఎన్‌సీడీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో శనివారం సైనిక్, నవోదయ పోటీ పరీక్షల అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి, అపుస్మా రాష్ట్ర అడకమిక్ కోఆర్డినేటర్ వీఆర్.రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ తదితర పోటీ పరీక్షల్లో విశ్వం విద్యార్థులు సీట్లు సాధిస్తుండడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న విశ్వం విద్యాసంస్థను అభినందించారు. విశ్వం విద్యాసంస్థ అధినేత ఎస్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత సమాచారానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కమిషనర్‌కు ప్రమాదం



ఆస్పత్రిలో కమిషనరు నరసింహప్రసాద్

పాకాల : కారు వెనుక టైరు పంక్చర్ కావడంతో చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ కారు ఫల్టీలు కొట్టింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళుతుండగా పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై మండల పరిధిలోని గాదంకి సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో కమిషనర్‌తో పాటు సీసీ అమర్నాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. వేగంగా వెళుతున్న కారు టైరు ఒక్కసారిగా పంక్చర్ కావడంతో కారు మూడు ఫల్టీలు కొట్టి ప్రయాణిస్తున్న మెయిన్ రోడ్డు నుంచి సర్వీసు రోడ్డుకు చేరుకుంది. అదే మార్గంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళి కారులో ప్రయాణిస్తున్న ఆయన పీఏ భాను ప్రమాదాన్ని గమనించి చికిత్స నిమిత్తం ఇద్దర్నీ తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తవణంపల్లె: తిరుపతి- బెంగళూరు హైవేలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని తిరుపతి- బెంగళూరు హైవేలో జేఎంఆర్ దాబా సమీపంలో గుర్తుతెలియని సుమారు 32 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటుతుండగా శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ క్రమంలో సదరు వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని ఆచూకీ లభించలేదు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం చిత్తూరు హాస్పిటల్‌కు తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే 9440900685లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

మార్కెట్‌లోకి కియా కారెన్స్ క్లావిస్



కారును ఆవిష్కరిస్తున్న షోరూం ప్రతినిధులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని ఇరువారంలో హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూంలో శనివారం కియా కారెన్స్ క్లావిస్ కారుని ఆవిష్కరించారు. మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమారెడ్డి పాల్గొని పూజలు చేశారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా నుంచి విడుదలైన కియా కారెన్స్ క్లావిస్ కారులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.

హత్యాయత్నం కేసులో అన్నదమ్ముల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మూడు రోజుల క్రితం జరిగిన అత్యాయత్నం కేసులో మహబూబ్‌బాషా (23), గౌస్‌బాషా(21) అనే ఇద్దరు అన్నదమ్ములను వన్ టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ మహేశ్వర కథనం మేరకు... చిత్తూరు గంగ జాతరలో మిట్టూరుకు చెందిన రాకేష్‌ని గిరింపేటకు చెందిన అన్నదమ్ములు మహబూబ్ బాషా, గౌస్ బాషా కత్తితో పొడిచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గంజాయి రవాణా చేస్తూ మహబూబ్‌బాషా గతంలో అరెస్టయ్యాడు. అయితే ఆ సమాచారాన్ని రాకేష్ పోలీసులకు చెప్పాడని కక్ష పెంచుకున్నాడు. అన్నదమ్ములు ఇద్దరూ అతనిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

అత్యాధునిక ఆర్థోపెడిక్ చికిత్సలు



అరగొండ అపోలో హాస్పిటల్లో మాట్లాడుతున్న సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్

తవణంపల్లె: గ్రామీణ ప్రాంత ప్రజలకు అరగొండ అపోలో హాస్పిటల్లో అత్యాధునిక పరికరాలతో సరసమైన ధరలకు మోకాళ్ల కీళ్లు, తుంటి మార్పిడి (ఆర్థోపెడిక్) శస్త్ర చికిత్సలు చేయడమే లక్ష్యమని ఆర్థోపెడిక్ చీఫ్ కన్సల్టెంట్, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డి డైరెక్ట్ యాంటీరియర్ వెల్లడించారు. శనివారం మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యాధునిక ఇమేజింగ్, స్పెషల్‌జ్ ఇన్‌స్ట్రుమెంట్లతో శిక్షణ పొందిన ఆర్థోపెడిక్ సర్జన్లచేత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్(డీఏఏ), వైద్య నిపుణులచేత చెన్నై అపోలో హాస్పిటల్లో శస్త్ర చికిత్సలు నిర్వహించి అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అరగొండ అపోలో హాస్పిటల్లో హిప్ రీప్లేస్‌మెంట్ కోసం డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్ అనే అత్యాధునిక, మినిమల్లీ ఇన్వేసివ్ టెక్నిక్‌ను ప్రవేశపెట్టడం ఆనందంగా ఉందన్నారు. కండరాలకు(మజిల్స్‌కు) హాని కాకుండా శస్త్ర చికిత్స అనంతరం నొప్పి తక్కువగా ఉంటుందని వివరించారు. ఆస్టియోఆర్థ్రైటిస్ రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, హిమ ఫ్రాక్చర్ వంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఇది మంచి అవకాశమన్నారు. అరగొండ అపోలో హాస్పిటల్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్(డీఏఏ)ని జిల్లాలోని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్థోపెడిక్ సర్జన్ నిపుణులు డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్, అనస్థీయాలజీ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనివాసన్ సోమసుందరమ్, పీఆర్‌ఓ కమ్రుద్దీన్ పాల్గొన్నారు.